# ప్రయాణం

-బెండపూడి రమేష్‌బాబు

రాకేష్‌కి దిగులుగా ఉంది. అంతకు మించి బాధగా వుంది. రేపు పుట్టింటి నుంచి వస్తున్న నందినికేం సమాధానం చెప్పాలో అర్థం కావడంలేదు. ఇదేమన్నా పదిమందికి చెప్పకునే ఘనకార్యమా తను చేసింది?

'అసలిది ఎలా జరిగిందండీ?' అని నందినీ ప్రశ్నిస్తే ఆమెకి చెప్పడానికి తన దగ్గర సమాధానం ఏది? ఈ విషయం బయటకి పొక్కి నలుగురికీ తెలిస్తే నవ్విపోతారు. బంధువులైతే మొహాన ఉమ్మేయ్యరూ? ఛీ...ఛీ.. తనెంత తెలివితక్కువతనంగా ప్రవర్తించాడు? ఇంత అనర్థానికి కారణం తనే. తప్పంతా తనదే. ఎవర్నీ నిందించి ప్రయోజనం ఏముంది? ఈ విషయాన్ని చాలా గోప్యంగా ఉంచాలి. చివరికి ప్రాణ స్నేహితులకు కూడా చెప్పకూడదు. ఆ నోటా ఈ నోటా పాకి పోలీసులకు తెలిస్తే 'అమ్మో..ఇంకేమైనా ఉందా? తన గుట్టు రట్టయి పరువు బజార్న పడదూ' అనుకున్నాడు రాకేష్.

అందుకే ఇంత అనర్థం జరిగినా తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయాడు.

అతనికి నిన్న జరిగిన సంఘటన గుర్తుకు రాసాగింది. ఆఫీసు పనిమీద వినుకొండకి బయలుదేరాడు రాకేష్. మంచుపొరల్ని చీల్చుకుంటూ రైలు వినుకొండవైపు దూసుకుపోతోంది. రైల్లో అతను, అతనికెదురుగా ఆమె.

కుందనం బొమ్మలా వున్న ఆమె అందాల్ని కళ్లతోనే తాగేస్తూ రాకేష్ తన్మయత్వం చెందసాగాడు. ఆమె ఏదో పుస్తకం చదువుతోంది. పుస్తకంలో జోక్స్‌కి విచ్చుకుంటున్న ఆమె పెదాల వంక చూడసాగాడు రాకేష్.

అప్పుడప్పుడు తలెత్తి కిటికీలోంచి పొలాల్ని కప్పేసిన మంచుపొరలవైపు చూస్తోంది.

"ఏ వూరు వెళ్లాలండీ మీరు?" అంది చేతిలో పుస్తకం పక్కన పెడుతూ.

ముందుగా ఆమె తీసుకున్న చొరవకు ఓ ప్రక్క ఆశ్చర్యంవేసినా కుందనం బొమ్మతో మాట్లాడే ఛాన్స్ దొరికినందుకు ఆనందం వేసింది అతనికి.

"ఆఫీస్ పనిమీద వినుకొండ పోతున్నానండీ" అన్నాడు.

"ఏం చేస్తుంటారు?" అందామె.

చెప్పాడు తను.

"మీరే వూరు వెళ్లాలి" అన్నాడు.

"మీరెళ్లే వూరే" అంది నవ్వుతూ.

చాలా కలుపుగోలు మనిషి అనుకున్నాడు రాకేష్ మనసులో. పరిచయమైన కొద్ది క్షణాల్లోనే ఎంతో ఆత్మీయురాలిగా అనిపించింది అతనికి. ఆమె ఎవరికో ఫోన్ చేస్తోంది.

"రాకేష్‌గారూ! ఇక్కడ సిగ్నల్స్ సరిగ్గా పనిచేయవా ఏమిటి? ఫోన్ పని చేయడంలేదు".

"అదేం లేదు లావణ్యగారూ... నా సిగ్నల్స్ బాగానే పన్జేస్తున్నాయే. బహుశా మీ కంపెనీ నెట్‌వర్క్ ప్రాబ్లం వచ్చిందేమో" అన్నాడు.

"ఏదీ నా సెల్‌కి ఓసారి రింగ్ ఇవ్వండి చూద్దాం. సిగ్నల్స్ సరిగ్గా ఉన్నాయే లేదో చూద్దాం" అందామె.

లావణ్య ఫోన్ రింగ్ అయింది.

"మీది ఫ్యాన్సీ నెంబర్‌లా వుందే. గుర్తు పెట్టుకోడం చాలా తేలిక" అందామె.

"అవునండీ. డబ్బిచ్చి కావాలనే పెట్టిచ్చుకున్నాను" అన్నాడు. రైలు వినుకొండలో ఆగింది.

"మాటల్లో తెలీలేదు కదండీ. అప్పుడే వూరొచ్చింది" అందామె. అతనూ రైలు దిగాడు.

★★★

ఆఫీస్‌లో పనిచేసుకుంటున్న రాకేష్‌కి ఫోన్ చేసింది లావణ్య. ఒకసారి వచ్చి తనను కలవమనీ, తానెక్కడుందీ చెప్పి ఫోన్ పెట్టేసింది లావణ్య. వూహించని ఈ అదృష్టానికి మురిసిపోయాడు రాకేష్. తంతే గారెల బుట్టలో పడడం అంటే ఇదే కాబోలు అనుకుంటూ.

వచ్చిన పని త్వరత్వరగా పూర్తి చేసుకుని లావణ్య చెప్పిన అడ్రస్‌కు బయలుదేరాడు.

లావణ్య దిగులుగా కనిపించింది అతనికి.

"ఏమయిందండీ?" అడిగాడు రాకేష్.

"హోటల్లో టిఫిన్ చేస్తుంటే నా పర్సు ఎవరో కొట్టేసారండీ. నా సెల్ కూడా అందులోనే ఉంది. నా ఫ్రెండ్‌కి ఫోన్ చేద్దామంటే ఆదీ ఈ మధ్య నెంబర్ మార్చింది. పోనీ ఇంటికి వెళ్దామంటే ఇల్లు మారారు ఈ మధ్య. ఏం చేయాలో అర్థం కావడంలేదండీ" అంది ఏడుపు ముఖం పెట్టి.

"సరే జరిగిందేదో జరిగిపోయింది. మీరు వైజాగ్‌కి వెళ్లాలంటే ఈ డబ్బు తీసుకోండి' అన్నాడు రాకేష్ డబ్బులు ఇవ్వబోతూ.

"ప్రశాంతి వినుకొండకు రాత్రి మూడుగంటలకుగానీ రాదుట. అప్పటిదాకా ఎక్కడ ఉండాలో తెలియడంలేదు. పైగా నాకెవ్వరూ తెలిసినవాళ్లు కూడా ఈ ఊళ్లో లేరండీ" అంది.

"పోనీ... ఓ పని చేయండి. ప్రశాంతి గుంటూరుకి ఆరుగంటలకిగానీ రాదు. అప్పటిదాకా మా ఇంట్లో రెస్టు తీసుకుని పొద్దుటే బయలుదేరి వెళ్లండి" అన్నాడు రాకేష్.

ఆ ప్రపోజల్‌కి ఒప్పుకుంది లావణ్య. బస్సులో ఆమె పక్కన కూర్చుని ప్రయాణం చేయడం అతనికెంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది. బస్సులో అతని భుజంపై తల వాల్చి నిద్రపోతున్న తీరు అతనిలో ఆలోచనల సునామీని సృష్టిస్తోంది. చల్లగాలికి రేగిన ముంగురులు నుదుటిపై నాట్యం చేస్తూ ఆమె అందానికి వింత శోభను తెస్తున్నాయి. తాను కదిలితే ఆమెకి ఎక్కడ నిద్రాభంగం అవుతుందోనని అలాగే కూర్చుండిపోయాడు రాకేష్. బస్సు గుంటూరు చేరింది.స్నానం చేసి వచ్చి నందినీ నైటీ వేసుకుంది లావణ్య.నందినికంటే లావణ్యకే బాగా ఉన్నట్టు అనిపించింది డ్రెస్. అదే మాట లావణ్యతో అన్నాడు. ఆమె నవ్వింది విరబూసిన మందారంలా. నైటీలో ఆమె అందాలు అతన్ని

పిచ్చివాడ్ని చేస్తున్నాయి. మంచు ముత్యంలా మెరిసిపోతున్నట్లనిపించింది.అతను మాట్లాడసాగాడు. ఆమె వింటోంది అతని మాటల్ని శ్రద్ధగా.

తన మాటలు ఆమెకు కోపం రావడంలేదంటే ఆమెకి తనంటే ఇష్టమేమో అనిపిస్తోంది అతనికి.

ఆమె చేతిన తన చేతిలోకి తీసుకుని సున్నితంగా నొక్కాడు.

"పాలు తెస్తాను ఉండండి. మగవాళ్లు రాత్రి పాలు తాగి పడుకోవాలిట '' అంటూ వంటింట్లోకి వెళ్లింది లావణ్య.

ఏవేవో ఊహించుకుంటూ ఆనందడోలికల్లో తేలిపోసాగాడు రాకేష్. లావణ్య ఇచ్చిన పాలు తాగిన తరువాత ఏం జరిగిందో అతనికి తెలీదు.

★★★

తెల్లవారింది. నిద్రలోంచి లేచి చూస్తే పక్కలో లావణ్యలేదు. ఆమె ఎక్కడికి వెళ్లిందో అతనికి అర్థం కాలేదు. ఇల్లంతా నీట్‌గా సర్ది మరీ పోయింది. వైజాగ్‌కి వెళ్లిపోయిందేమో అనుకున్నాడు రాకేష్. అప్పుడే వచ్చిన న్యూస్ పేపర్‌లో ఓ హెడ్డింగ్ అతన్ని ఆకర్షించింది.

రైల్లో మారుపేర్లతో పరిచయాలు పెంచుకుని ఇళ్లల్లో బంగారం దోచుకునే ఓ ముఠా సంచరిస్తోందనీ, ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని దాని సారాంశం.

అది చదివిన రాకేష్‌కు అనుమానంవచ్చి బీరువా తీసిచూసాడు. అంతే...!

నందిని బంగారం మాయమైపోయింది. అంటే తనో దొంగల ముఠా సభ్యురాలినా అంత ప్రేమగా ఇంట్లోకి తెచ్చి పెట్టుకుంది? ఎంత తెలివితక్కువగా ప్రవర్తించాడో తలచుకుంటుంటే అతనికి అసహ్యమేసింది. ఇప్పుడేమనుకున్నా ఏముంది! రేపు వస్తున్న నందినికి చెప్పడానికి జవాబేం లేదు అతని దగ్గర ప్రస్తుతానికి.

★

